## జూన్ 30 వరకు రేషన్ బియ్యం

బాలానగర్ : ఆహార భద్రత కార్డు లబ్ధిదారులందరికీ (రేషన్‌కార్డు హోల్డర్లు) జూన్ నెల 1 నుంచి 30వ తేదీ వరకు మూడు నెలల బియ్యం పంపిణీ చేయనున్నట్లు మేడ్చల్ జిల్లా డీసీఎస్‌ఓ శ్రీనివాస రెడ్డి తెలిపారు. జూన్, జూలై, ఆగస్టు నెలల రేషన్ బియ్యాన్ని మూడుసార్లు బయోమెట్రిక్ ప్రెస్ చేసి ప్రజా పంపిణీ దుకాణాల్లో ( చౌకధరల దుకాణం) పొందవలసిందిగా సూచించారు.

## నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జడ్సీ అపూర్వ చౌహాన్ కోరారు. నేడు ఉదయం 10 : 30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ కార్యాలయంలో నేడు ఉదయం 10 : 30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని, ప్రజలు సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరించుకోవాలని జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు గంగాధర్, వంశీకృష్ణ కోరారు.

## కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతు బజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు ( కేజీ – రూపాయలు). టమాట 21, వంకాయ 23, బెండ 45, పచ్చి మిర్చి 40, బజ్జి మిర్చి 25, కాకర 38, బీర 40, క్యాబేజీ 15, ఫ్రెంచ్ బీన్స్ 90, క్యారెట్ 38, కాలీఫ్లవర్ 28, దొండ 21, చిక్కుడు 65, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 21, క్యాప్సికం 60, ఆలు 24, కీరా 23, దోస 18, సోర 12, పొట్లకాయ 23, కందగడ్డ 50, ఉల్లిపొరక 55, ఉల్లిగడ్డ 20, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ 9 నుంచి 11, చామగడ్డ 31, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 30 నుంచి 40, మునగకాయ(1) 5 నుంచి 6, పొప్పడి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

# రోడ్డును ఆక్రమించి నిర్మాణం



బాచుపల్లి రాజీవ్‌గాంధీ నగర్‌లో రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణం

దుండిగల్, జూన్ 8 : రోడ్డును ఆక్రమించి దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు కొందరు అక్రమార్కులు. ఇదేమని అడ్డగించిన స్థానికులపై చిందులు వేస్తున్నారు. పైగా తమకు పొలిటికల్ అండదండలు ఉన్నాయి.. అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. వివరాల్లోకి వెళ్తే .. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, 15వ డివిజన్, రాజీవ్‌గాంధీ నగర్‌లోని మజీద్ రోడ్డులో ఓ వ్యక్తి తనకున్న 100 గజాల స్థలంలో ఇంటి నిర్మాణ పనులు మొదలుపెట్టారు. అయితే మెట్లు నిర్మాణం కోసం 5 ఫీట్లరోడ్డు స్థలాన్ని ఆక్రమించి పిల్లర్లు వేసేందుకు ప్రయత్నిస్తుండగా, స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు ఎందుకు చేపడుతున్నారని ప్రశ్నించగా.. అంతా మా ఇష్టం ఏం చేసుకుంటారో చేసుకోండి.. అంటూ స్థానికులతో వాగ్వాదానికి దిగారు. గతంలో ఎంతవరకైతే నిర్మాణం ఉందో అంతవరకు నిర్మాణం చేపడితే ఎవరికీ అభ్యంతరం లేదని స్థానికులు చెప్పినప్పటికీ నిర్మాణదారులు ఎవరి మాటలు వినకుండా పెడచెవిన పెడుతూ తమ పని కానిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన తమకు ఎటువంటి భయం లేదని నిర్మాణదారులు పేర్కొనడంతో బస్తీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై చేపట్టిన నిర్మాణాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



మియాపూర్ : మాగంటి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు సతీశ్

## మాగంటి మృతి తీరని లోటు

మియాపూర్, జూన్ 8 : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, సోదర సమానుడు మాగంటి గోపీనాథ్ మృతిపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీఎస్ చైర్మన్ అరికెపూడి గాంధీ సంతాపం వ్యక్తం చేశారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణం అత్యంత బాధాకరమని, తనను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. గాంధీ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అనారోగ్యంతో మరణించారన్న వార్త తీవ్రంగా బాధించిందన్నారు. ఆయన లేని లోటు తీరనిది అని, మాగంటి కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. వారి కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ముందుకు సాగాలని.. వారికి భగవంతుడు ధైర్యం, శక్తిని ఇవ్వాలని కోరుకున్నారు. మృదుస్వభావి, సౌమ్యుడు, రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చిన మాగంటి జీవితం ఎంతో మందికి ఆదర్శమని, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే గాంధీ తెలిపారు.

## దైవచింతనతోనే మానసిక ప్రశాంతత



శివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు శంభీపూర్ కృష్ణ

దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, చర్చ్ గాగిల్లాపూర్‌లో నూతనంగా నిర్మించిన శివాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ పాల్గొని పూజలు చేశారు. కృష్ణ మాట్లాడుతూ.. ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. దైవ చింతనతో మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు జోసెఫిన్ సుధాకర్ రెడ్డి, కుంటి అరుణ నాగరాజు, సీనియర్ నాయకులు రంజిత్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత వినికిడి పరీక్షా శిబిరం




జగద్గిరిగుట్ట జూన్ 8 : శబ్ద కాలుష్యం, వినికిడి సమస్యలపై జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. రంగారెడ్డి నగర్ డివిజన్ ఆదర్శనగర్ లో ఆదివారం అంప్లిఫోన్ సంస్థ సహకారంతో ఉచిత శ్రవణ పరీక్ష శిబిరం నిర్వహించారు.అవసరమైన వారికి వినికిడి పరికరాలు సబ్సిడీలో అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. సీనియర్ సిటిజన్లు, భారీ శబ్దాలతో కూడిన యంత్రాల వద్ద పనిచేసేవారు జాగ్రత్తలతో పాటు తరచూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకరయ్య, వైద్యులు అభిషేక్, జయ, మేనేజర్ సాజన్, వెంకటేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## వార్డు కార్యాలయాన్ని తరలించొద్దు



కీసర : కీసరలోని వార్డు కార్యాలయాన్ని కీసర నుంచి మార్చితే సహించేది లేదని పలు రాజకీయపార్టీల నాయకులు హెచ్చరించారు. కీసరలోని ప్రధాన చౌరస్తాలో ఆదివారం కీసర వార్డు కార్యాలయాన్ని మార్చొద్దంటూ ధర్నా చేపట్టారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నాయకపు వెంకటేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. కీసరను ప్రత్యేక మున్సిపాలిటీ చేయాలని విన్నవించుకున్నా పట్టించుకోని సీఎం ఏకంగా కీసరను దమ్మాయిగూడ మున్సిపాలిటీ విలీనం చేసి తప్పు చేశారని, కీసరకు గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కీసరలోని వార్డు కార్యాలయాన్ని తొలగించడం ఎంతవరకు సమంజసమన్నారు. కలెక్టర్, ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు స్పందించి వార్డు కార్యాలయం కీసరలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సిటీ రిపోర్టింగ్ రూం ప్రారంభం




కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు కె. నారాయణ

మాదాపూర్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో సీఆర్ పాలిక్ క్లినిక్ సిటీ స్కాన్ శ్రీసత్య బొల్లి ప్రొఫిలిక్స్‌తో ఈ సిటీస్కాన్ 32–96 స్లైట్స్‌తో సిటీ రిపోర్టింగ్ రూం ప్రారంభించారు. సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు, డాక్టర్ కే నారాయణ విచ్చేసి ఫౌండేషన్ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. చుట్టుప్రక్కల ప్రజలకు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండేలా ఉపయోగించుకోవచ్చున్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ డెక్కన్ ప్రెసిడెంట్ జస్విందర్ బార్గి, కార్యక్రమ కో – ఆర్డినేటర్ నితీశ్, సీఆర్‌ఎఫ్ గౌరవాధ్యక్షుడు, డాక్టర్ కె. నారాయణ, డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి, శ్రీసత్య బొల్లి, డాక్టర్ జయం చుక్క, ప్రొ.డి.ప్రసాద్ రావు పాల్గొన్నారు.

## హిందూ సామ్రాజ్య దినోత్సవ శోభాయాత్ర



ర్యాలీలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు, స్థానికులు

దుండిగల్ : హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ప్రగతి నగర్‌లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. హిందువులందరూ అరబ్, మొఘల్ మతోన్మాద ఇస్లాం పాలకుల దారుణాలకు దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు ఆశా కిరణంలా జన్మించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ హిందూ మహా సామ్రాజ్య పట్టాభిషిక్తుడైన జ్యేష్ట శుద్ధ త్రయోదశి రోజును హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం (ఆర్‌ఎస్‌ఎస్) పిలుపుమేరకు హిందూ సంఘాలు నిర్వహించిన శోభాయాత్రలో అశేషంగా హిందువులు పాల్గొనడం సంతోషకరమన్నారు. ప్రగతి నగర్ కోతిబొమ్మల సెంటర్ నుంచి రహదారుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. వివిధ సంస్థలు, పార్టీలకు చెందిన డా.ఎమ్ఆర్ఎస్ రాజు, మధుజీ, కంతేటి సుబ్బారావు, సత్య కాటేపల్లి, రచ్చ చక్రధర్, లక్ష్మీ రామారావు, బిక్షపతి యాదవ్, శేషారావు, నరేంద్ర చౌదరి, శ్రీనివాస్ గుప్తా, దాసి నాగరాజు, సుమన్ రావు, కిశోర్, వెంకటేశ్, కౌశిక్ నాయుడు, లింగారెడ్డి, వినీత్, అశోక్, భారతి, శిల్ప, కల్యాణి, సూర్య నారాయణ, డా.వెంకన్న, జనార్దన్ రెడ్డి, మధుసూదన్, రాజశేఖర్ రెడ్డి, బాలాజీ నాయక్, భరత్ రెడ్డి పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్, వృత్తి విద్యా కోర్సుల ఫీజులు పెంచొద్దు

కాచిగూడ : ఇంజినీరింగ్, వృత్తి విద్యా కోర్సుల ఫీజులను పెంచి పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తుందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ అన్నారు. ఆదివారం నింబోలిలో ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజులను పెంచాలనే రెగ్యులేటరీ కమిటీ ప్రతిపాదనను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీ–కేటగిరి సీట్లను ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అధిక డొనేషన్లు వసూలు చేస్తున్న ఇంజినీరింగ్ కళాశాలలను సీఎం రేవంత్‌రెడ్డి రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భూషణ్ భాస్కర్, డాక్టర్ ప్రశాంత్ నిమ్కర్, పులిజాల కృష్ణ, ముత్యాల్ రావు పాల్గొన్నారు.

## తెలంగాణ భవన్‌కు కార్యకర్తలు తరలిరావాలి

కాప్రా : మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు సోమవారం హాజరు అవుతున్న సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు సోమవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ భవన్‌కు రావాలని ఏఎస్‌రావునగర్‌లోని మ్మెల్యే కార్యాలయం ప్రకటనలో తెలిపింది.

## రేణుకా ఎల్లమ్మ ప్రాణప్రతిష్ఠ

గోల్నాక : గోల్నాక డివిజన్ శంకర్ నగర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఎల్లమ్మ తల్లి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి హోమం, మహా పూర్ణాహుతితో పా టు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శంకర్ నగర్ దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక కార్పొరేటర్ కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ హాజరై పూజలు చేశారు.

### బీఆర్‌ఎస్ నాయకుడు వెంకటరెడ్డి పూజలు

అంబర్‌పేట : గోల్నాక డివిజన్ శంకర్‌నగర్‌లో శ్రీ రేణుక ఎల్లమ్మ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకుడు బి.వెంకటరెడ్డి పాల్గొని పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు ఆయనను సత్కరించారు.

## 10న హిందీ ప్రచార సభ వార్షికోత్సవాలు

రవీంద్రభారతి : తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో హిందీ భాషాభివృద్ధికి విశేషకృషి చేసి వేలాది మందిని అధ్యాపకులుగా తీర్చిదిద్దిన హిందీ ప్రచార సభ హైదరాబాద్ సంస్థ 90వ వార్షికోత్సవాలను నిర్వహిస్తామని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎస్. గైబువల్లి, అధ్యక్షుడు ప్రొ.చంద్రదేవ్ కావడే వెల్లడించారు. కార్యక్రమానికి అతిథులుగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్, సెంట్రల్ హిందీ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ బాబురావు కులకర్ణి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర సురేశ్‌పురి, గిరిధర్‌రావు, శృతికకాంత్ భారతి, డా.సుష్మాదేవి పాల్గొన్నారు.

## శిల్పారామంలో బెంగళూరు కళాకారులు



కొండాపూర్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బెంగళూరు కూచిపూడి కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో గురువులు లాస్య ఎడార శిష్య బృందం ప్రదర్శనలు అలరించాయి. సాయి రాగ, తేజస్విని, శ్రీ లాస్య, మాన్విత, శాన్వి, అనన్య, సహస్ర, వైష్ణవి, రిత్విక, హర్షితరెడ్డి, సాయి సాన్విక, గౌరి ప్రదర్శించిన తీరు ఆద్యాంతం ఆకట్టుకున్నది.

## జనరంజని మ్యూజికల్ సంస్థ వార్షికోత్సవం




గాయనీగాయకులతో సామల రమేశ్, అరుణకుమార్

రవీంద్రభారతి, జూన్ 8 : జనరంజని మ్యూజికల్ సంస్థ 3వ వార్షికోత్సవాలు ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. జనరంజని సర్వే సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, సినీ దర్శకులు సామల రమేశ్, ఖాజాపాషా, గాయకులు వరికుప్పల యాదగిరి పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేశారు. గాయకులు, సంగీత దర్శకులు, కళాకారులను పురస్కారాలతో సన్మానించారు. అరుణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. జనరంజని మ్యూజికల్ సంస్థ 3 వ వార్షికోత్సవాలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. గాయకురాలు అరుణ కుమారిని పురస్కారంతో ఘనంగా సత్కరించి అభినందించారు.

## జీహెచ్‌ఎంసీ కార్మికులకు చీరలు పంపిణీ

కాచిగూడ, జూన్ 8 : పేద ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని సంఘ సేవకురాలు దేవిరెడ్డి విజితారెడ్డి అన్నారు. విమలాసుధాకర్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ విజితారెడ్డి ఆధ్వర్యంలో ఆదివా రం కూచి కుళ్ల విమలాసుధాకర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని బర్కత్ పుర డిపో సమీపంలో జీహెచ్‌ఎంసీ కార్మికులకు చీరలు, పం డ్లు, బ్రెడ్ పాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు మగవాళ్లే వర్ధవంతులు, తదితర కార్యక్రమాలు చేస్తారన్న అపోహలను ఆడవాళ్లు కూడా చేస్తారని నిరూపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఫౌండేషన్ సెక్రటరీ శ్వేత, సుశీల, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## మృగశిర కార్తె.. చేపలకు భలే గిరాకీ



రాజబొల్లారం చెరువు వద్ద కొరమీనులతో యువకుల ఆనందం

మేడ్చల్, జూన్ 8: మృగశిర కార్తె సందర్భంగా ప్రతిసారి మాదిరిగానే ఈసారి కూడా వినియోగదారులు విపరీతమైన ఆసక్తి చూపారు. మృగశిర కార్తె ఆదివారం రావడంతో గతంలో కంటే మరింత డిమాండ్ పెరిగింది. గిరాకీ పెరిగిన దృష్ట్యా విక్రయదారులు చేపల ధరలను పెంచారు. మేడ్చల్ పట్టణంలోని చేపల మార్కెట్, కేఎల్ఆర్ కమాన్, కిష్టాపూర్, రేకుల బావి తదితర ప్రాంతాల్లో చేపలను విక్రయించగా కొనుగోలుకు ఎగబడ్డారు. రౌ, గ్యాస్‌కట్ తదితర చేపలు సాధారణంగా కిలోకు సాధారణ రోజుల్లో రూ.150–200 పలికితే ఆదివారం రూ.250 నుంచి రూ.300 వరకు పలికాయి. కొరమీను చేపలు సాధారణంగా రూ.450 నుంచి రూ.500 పలికితే రూ.650 నుంచి రూ.800 వరకు పలికాయి. ఉదయం మాత్రమే చేపలు ధరలు పెరిగి, సాయంత్రానికి మాత్రం సాధారణ రోజుల ధరనే పలికాయి. మేడ్చల్ పట్టణానికి చెందిన పలువురు శామీర్‌పేట పెద్ద చెరువు, రాజబొల్లారం, యాడా రం, తదితర ప్రాంతాలకు వెళ్లి చేపలను కొనుగోలు చేశారు. డిమాండ్ దృష్ట్యా కొంత మంది ఒక రోజు ముందుగానే చేపలను కొనుగోలు చేశారు.

## నృత్య కళా ప్రక్రియలు ఔషధంగా పనిచేస్తాయి

తెలుగుయూనివర్సిటీ, జూన్ 8 : భారతీయ శాస్త్రీయ సంప్రదాయ నృత్యరీతులను అవపోసన పట్టిన ఔత్సాహిక కళాకారులకు ధృవ పత్రాల పంపిణీ కార్యక్రమం తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. శివానంద లహరి సంగీత, నృత్య, ఫైన్ ఆర్ట్స్ అకాడమీ గురువు యశశ్రీ పర్యవేక్షణలో భారతీయ కళా సంస్కృతులను ప్రతిబింబించే అంశాలలో శిక్షణ పొందిన వారికి ధ్రువ పత్రాలను కేంద్ర సంగీత అకాడమీ అవార్డు గ్రహీత సురభి ఆర్.వేణుగోపాలరావు ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. కళా ప్రక్రియలు ఒత్తిడిలో ఉన్న సమాజానికి ఔషధంగా పని చేస్తాయని అన్నారు. గొప్ప కళాకారులుగా చిన్నారులను తీర్చిదిద్దుతున్న గురువుల కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా కళాకారులు పలు అంశాలను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. గురువులు శ్యామల శ్రీనివాస్, డాక్టర్ ఎం. జంపాల రాణి, కి జయశ్రీ, సంస్థ అధ్యక్షులు బి. వివేకానంద, బి. జ్యోతి పాల్గొని చిన్నారి కళాకారులను అభినందించారు.



వేదికపై నృత్య ప్రక్రియలను ప్రదర్శిస్తున్న కళాకారులు

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ

**మేడ్చల్, జూన్ 8:** తూంకుంట మున్సిపల్ పరిధిలోని అంతాయిపల్లిలో జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కత్తి రమేష్, రాజనాల శ్రీధర్ రెడ్డి, మహేష్‌తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.